క్లుప్తంగా

నేడు, రేపు 'జగనన్న సురక్ష'

వీరఘట్టం: స్థానిక కోదండరామ కల్యాణ మండపంలో గురు, శుక్రవారాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈవోపీఆర్‌డీ వి.రామచంద్రరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరఘట్టం మేజరు పంచాయతీలోని సచివాలయం 1, 3 పరిధిలో వారందరికీ గురువారం, సచివాలయం 2, 4 వారందరికీ శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఆయా సచివాలయాల సిబ్బంది, గ్రామ వలంటీర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ముమ్మరంగా రీ సర్వే



పట్టణానికి సంబంధించి భూముల రీ సర్వే చేస్తున్న సిబ్బంది

పాలకొండ: నగర పంచాయతీలో భూముల రీ సర్వే ముమ్మరంగా చేపడుతున్నారు. బుధవారం వర్షం పడుతున్నప్పటికీ సర్వే సిబ్బంది రీ సర్వే కొనసాగించారు. గజాల ఖానా వద్ద గల తోటలను సర్వే చేశారు. ఈ సర్వేను తహసీల్దార్ పి.సోమేశ్వరరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారికి సూచనలు అందించారు. ఎక్కడా లోపాలు లేకుండా సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

పోలవరంలో పొలంబడి



వరినారు నాటే ముందు తీసుకోవలసిన చర్యలపై వివరిస్తున్న ఎంఏవో సింహాచలం

భామిని: మండలంలోని పోలవరంలో ఎంఏవో కె.సింహాచలం ఆధ్వర్యంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు రైతులకు పలు సూచనలు చేశారు. వరి నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏఏలు భవాని, ఎలీసా, గిరిజన రైతులు పాల్గొన్నారు.

పులిపుట్టి స్కూల్ కాంప్లెక్స్ సందర్శన



సూచనలిస్తున్న డిప్యూటీ ఈవో లిల్లీరాణి

సీతంపేట: మండలంలోని పులిపుట్టి స్కూల్ కాంప్లెక్స్‌ను ఐటీడీఏ డిప్యూటీ ఈవో ఎ.లిల్లీ రాణి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు సూచనలిచ్చారు. గ్రామాల్లో డ్రాపౌట్లను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రాథమిక విద్య బలోపేతానికి చర్యలు తీసుకోవాలన్నారు. జేవీకే బ్యాగులు సక్రమంగా వినియోగించేటట్లు చూడాలన్నారు. విద్యార్థులకు రోజువారీ పరీక్షలు నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు.

దొరికిన బ్యాగ్ యజమానికి అప్పగింత

- సాక్షి ఎఫెక్ట్



రామరాజుకు బ్యాగ్ అందజేస్తున్న డబ్ల్యూపీసీ చందన

భామిని: మండల కేంద్రంలోని ఏబీ రోడ్డుపై లభించిన బ్యాగు యజమానికి బుధవారం చేరింది. సాక్షిలో బుధవారం ప్రచురితమైన 'బ్యాగ్ లభ్యం' వార్తతో బాలేరుకు చెందిన జామి రామరాజు తన బ్యాగు విషయం తెలుసుకున్నాడు. భామిని సచివాలయానికి బుధవారం వచ్చి మహిళ పోలీస్ చందన పట్నాయిక్ నుంచి దాన్ని అందుకున్నాడు. సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపాడు.

ఎల్విన్‌పేటలో వాహన తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట చెక్‌పోస్టు వద్ద సీఐ సత్యనారాయణ బుధవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులకు సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. రికార్డులు కలిగి లేని, హెల్మెట్ ధరించని వారికి, పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలకు సంబంధించి అపరాధ రుసుం విధించారు. రహదారి భద్రత నియమాలు పాటించాలంటూ పలు సూచనలు చేశారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పిల్లలు బడిలోనే ఉండాలి

భామిని: బడి బయట పిల్లలను మన్యం జిల్లా డీసీడీవో రోజారమణి బడిలో బుధవారం చేర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను గుర్తించి తల్లిదండ్రులు తమ పిల్లలను బడుల్లో చేర్పించాలని కోరారు. భామిని, కోసలి గ్రామాల్లో డ్రాపౌట్స్ జాబితా ప్రకారం ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను ఒప్పించి గురుకులంలో, కేజీబీవీల్లో చేర్పించారు. ఎంఈఓలు ఎ.శ్రీనివాసరావు, వి.భాస్కరరావు ఆధ్వర్యంలో పిల్లలను చేర్పించారు.

వరి నాట్లు ఇలా వేస్తే మేలు

- యాజమాన్య పద్ధతులు పాటించకపోతే దిగుబడులపై ప్రతికూల ప్రభావం
- కాలిబాటలు తప్పనిసరి
- నీటి యాజమాన్యం పాటించాలి
- ఊపందుకున్న ఉభాలు



ఉభాలకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

సీతంపేట: ఖరీఫ్ సీజన్‌లో వరి నాట్లు ముమ్మరమయ్యాయి. నాట్లు వేసేటప్పుడు తగిన యాజమాన్య పద్ధతులు పాటించకపోతే దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడే అవకాశముంది. దాదాపు 70 వేల హెక్టార్లలో వరి పండుతుంది. ఇప్పుడిప్పుడే వరినాట్లు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై ఐటీడీఏ ప్రాజెక్టు అగ్రికల్చరల్ ఆఫీసర్ హరికృష్ణ రైతులకు పలు సూచనలు చేశారు.

- దుక్కిలో మొదటి దఫా ఎరువులు

ప్రధాన పొలాన్ని దున్నిన తర్వాత దమ్ము చేయాలి. తద్వారా నీటి వృథాను అరికట్టవచ్చు. చివరి దమ్ములోనే ఆయా ప్రాంతాలకు సిఫార్సు చేసిన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల్ని మొదటి దఫాగా వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువులు వాడదల్చుకుంటే వాటిని దుక్కిలోనే వేసుకోవడం మంచిది. దమ్ములో జింక్ భాస్వరం ఎరువుల్ని ఒకేసారి వేయకుండా 2–3 రోజుల తేడా ఉండేలా చూడాలి.

నాట్లు వేసేటప్పుడు..

ఆరోగ్యవంతమైన నారు మొక్కలు ప్రధాన పొలంలో నాటుకోవాలి. 4–6 ఆకులు కలిగిన మొక్కలు అనుకూలంగా ఉంటాయి. బురద పదును ఉండేలా పొలాన్ని తయారు చేసుకొని అందులో మొక్కల్ని 2–3 సెంటీమీటర్ల లోతులో అంటే పైపైన నాటడం మంచిది. నాటిన మొక్కలు చనిపోకపోతే కుదురుకు 1–2 మొక్కలు ఉన్నప్పటికి దిగుబడిలో తేడా ఉండదు. కుదురుకు 2–3 మొక్కలు కూడా నాటవచ్చు. సరైన వయసులో మొక్కలు నాటితే కొనల్ని కత్తిరించాల్సిన అవసరం ఉండదు. సాధారణంగా ఖరీఫ్‌లో



హరికృష్ణ

చదరపు మీటర్‌కు దీర్ఘకాలిక రకాలైతే 33 కుదుళ్లు, మధ్యకాలిక రకాలైతే 44 కుదుళ్లు, స్వల్పకాలిక రకాలైతే 50 కంటే ఎక్కువ కుదుళ్లు ఉండేలా చూసుకోవాలి. కుదుళ్లు తగ్గితే దిగుబడిపై ప్రభావం పడే అవకాశముంది. నాట్లు ఆలస్యమై ముదురు నారు నాటాల్సి వేస్తే కుదుళ్ల సంఖ్యను పెంచుకోవాలి. మొక్కలు సమాన దూరంలో ఉంటేనే లాభదాయకం.

కాలిబాటలు మరువద్దు

నాటు వేసేటప్పుడు వేసిన తరువాత ప్రతీ రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల చొప్పున కాలిబాట తీస్తే పైరుకు గాలి వెలుతురు పుష్కలంగా లభిస్తాయి. చీడపీడల ఉధృతి తగ్గుతుంది. పైరు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించవచ్చు.

నీటి యాజమాన్యం

నాట్లు వేసినప్పటి నుంచి పైరు మొన తిరిగే వరకు అంటే 20 రోజుల పాటు చేలో పలుచగా నీరు ఉండాలి. పొలంలో నీరు తగిన మోతాదులో ఉంటే సుడిదోమ, లద్దెపురుగుల తాకిడి పెద్దగా ఉండదు. తడి ఆరిపోతే కలుపు మొక్కలు ఎక్కువగా వస్తాయి. రసాయన ఎరువులు వేసేటప్పుడు పొలంలో నీరు తక్కువగా ఉండాలి. మొక్కలు నాటిన వారం పది రోజులకు పైరు పిలకలు తొడగడం ప్రారంభం అవుతుంది. 50–60 రోజులకు పిలకలు గరిష్ట స్థాయికి చేరుకుంటాయి.

సంక్షేమ సారథి సీఎం జగనన్న



అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

- పాలకొండ ఎమ్మెల్యే కళావతి
- హడ్డుబంగిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సీతంపేట: రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని హడ్డుబంగి పంచాయతీ పరిధి చింతాడ తదితర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటుగా పథకాలు ఎలా అందుతున్నాయనేది అడిగి తెలుసుకున్నారు. సమస్యలు కొన్నింటిని అక్కడే పరిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని, నిత్యం ప్రజలు సంతోషంగా ఉండే విధంగా అనేక పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులైన రహదారులు, తాగునీరు, డ్రైనేజి సౌకర్యాలు, వరద గోడలు కల్పిస్తున్నామన్నారు. గడప గడపకు పూర్తయిన గ్రామ సచివాలయాలకు రూ.40 లక్షల నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ నిధులతో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

అర్హులైన అందరికి అటవీ హక్కుల సాగు పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను ప్రజలు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, వైస్ ఎంపీపీ కె.సరస్వతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు ఎస్.రాము, కుమార్, షోడంగ, ఎం.రామారావు, కాంతారావు పాల్గొన్నారు.

కార్గిల్ అమరుల సేవలు మరవలేనివి

గరుగుబిల్లి: కార్గిల్ పోరాటంలో అమరులైన పోరాట యోధుల సేవలు మరువలేనివని డా.వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. బి.ప్రసన్నకుమార్ అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్గిల్ దివస్‌లో హవల్దార్ ఎం.శివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిగ్గా 23 ఏళ్ల క్రితం 1999 జూలై 26న దేశమంతా జయహో భారత్ అంటూ విజయనాదం చేసిందన్నారు.

దేశాన్ని రక్షించేందుకు సైనికులు ప్రాణాలను తెగించి పోరాటం చేస్తారన్నారు. అనంతరం హవల్దార్ శివాజీని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో బహుళ ప్రయోజనాలు

కురుపాం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత అన్నారు. మండలంలోని బియ్యాలవలస పంచాయతీ కేంద్రంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని కుల, ఆదాయ, నివాస, ధ్రువపత్రాలను ఎంపీపీ, జెడ్పీటీసీలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలో ధ్రువపత్రాల కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వచ్చేదని, ప్రస్తుతం సురక్ష కార్యక్రమంలో వెంటనే ధ్రువ పత్రాలను ప్రభుత్వ శాఖలు మంజూరు చేస్తున్నాయని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, వీఆర్‌వో రవికుమార్, కార్యదర్శి అనూరాధ, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, అయ్యరక కార్పొరేషన్ డైరెక్టర్ గవర విజయ్, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు నిషార్ పాల్గొన్నారు.



జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

ప్రజా సమస్యలపై పోరాడిన వారికి మరణం లేదు...

గరుగుబిల్లి: ప్రజల సమస్యల కోసం పోరాడిన వారికి మరణం ఉండదని ఉమ్మడి విజయనగరం జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అన్నారు. మండలంలోని రావివలస గ్రామంలో దివంగత ఎమ్మెల్యే మరిశర్ల శివున్నాయుడు విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పట్ల రాజీలేని పోరాటం చేసిన గొప్ప రాజకీయవేత్త శివున్నాయుడన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేసేవారని కొనియాడారు. రావివలసలో పీఏసీఎస్ భవనానికి ఆయన పేరు పెట్టడంతో ఆయన కీర్తి పతాకస్థాయికి చేరిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కోట భరత్, మహిళ సంఘ నాయకులు జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



దివంగత ఎమ్మెల్యే శివున్నాయుడు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ బాపూజీనాయుడు

కళాశాల ప్రిన్సిపాల్‌గా సత్యప్రభ



ప్రిన్సిపాల్ సత్యప్రభ

పాలకొండ : స్థానిక ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉత్తరావిల్లి సత్యప్రభ నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్ విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యప్రభ వీరఘట్టం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలుగా విధులు నిర్వహించేవారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పాలకొండలో విధులు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎకనమిక్స్ అధ్యాపకులు ఎస్.సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు.

మెనూలో రాజీ పడొద్దు..



గురుకులంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

భామిని: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీడీవో గుండేలా చంద్రరావు, ఈవోపీఆర్‌డీ గుర్ల కృష్ణారావు మధ్యాహ్న భోజనాలు బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాల రుచి చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గుర్తింపు పొందిన సరుకులను మాత్రమే వాడాలన్నారు. ఇప్పటికే ఉపయోగిస్తున్న కిరాణా సరుకులను వారు పరిశీలించారు. భోజనాల నాణ్యతపై వస్తున్న ఆరోపణలపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్ విజయనిర్మల, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

గుమ్మలక్ష్మీపురం: అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించి అగ్నిమాపక కేంద్రం అధికారి ప్రసాదరావు బుధవారం అవగాహన కల్పించారు. స్థానిక ఇండేన్ గ్యాస్ గొడాం వద్ద అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహించి అక్కడ సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎర్ని బాబు, ఎస్.రవి, తవిటి నాయుడు, ఎం.తిరుపతిరావు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింట సర్వేపై సబ్ కలెక్టర్ పరిశీలన

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి గ్రామంలో జరుగుతున్న ఇంటింట సర్వేను సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం పరిశీలించారు. సర్వే ఏ విధంగా జరిగింది, వాటిలో వాస్తవం ఎంత అనే దానిపై ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. చినమేరంగిలోని 111, 112 బూత్‌లలో ఉన్న ఓటర్ల లిస్టును పరిశీలించారు. డెత్‌ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, ఇంటి నంబర్లు సరిగా ఉన్నాయా.. లేదా అనే దానిలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ కేవీ సీతారామయ్య, బీఎల్‌వోలు ఉన్నారు.

విద్యార్థికి అభినందనలు

పాలకొండ రూరల్: స్థానిక పెద్దకాపువీధి జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి పూర్తి చేసిన యామల అభిషేక్ ఇటీవల విశాఖలోని అక్కయ్యపాలెంలో గల స్పోర్ట్స్ అకాడమికి ఎంపికయ్యాడు. ఈ మేరకు స్థానిక పాఠశాల హెచ్‌ఎం పి.సోమేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయులు వి.పుష్పనాథంతో పాటు సహోపాధ్యాయులు అభిషేక్‌లను బుధవారం అభినందించారు. చదువులతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలన్నారు.

వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సేవలు

సీతంపేట: పెదపల్లంకివలసలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. 24 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. యాంటీ లార్వా ఆపరేషన్ చేపట్టారు. అలాగే దోమ తెరలపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్సీ



డంపింగ్ యార్డు స్థల సమస్యపై పరిశీలన చేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్ తదితరులు

పాలకొండ: నగర పంచాయతీకి సంబంధించి డంపింగ్ యార్డు నిర్మాణ పనులకు అడ్డంకులు తొలగించాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని టీడీపారాపురం వద్ద డంపింగ్ యార్డుకు రెవెన్యూ అధికారులు కేటాయించిన స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. డంపింగ్ యార్డు పనులను కొంతమంది అడ్డుకుంటున్న నేపథ్యంలో పోలీసు సిబ్బంది పనుల వద్ద పహరా ఉన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ విక్రాంత్ కోరారు. పట్టణంలో డంపింగ్ యార్డు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని వివరించారు. ప్రస్తుతం నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేస్తున్న వారిని టీడీపారాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు అడ్డుకుంటున్నారని తెలిపారు. పనులు సజావుగా జరిపించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే స్థలం కేటాయించి ఏడాది పూర్తి కావస్తుందని స్థల వివాదం పరిష్కరించి వెంటనే పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఆయనతో పాటు నగర పంచాయతీ అధ్యక్షురాలు యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, కౌన్సిలర్లు దుప్పాడ పాపినాయుడు, కొంచాడ అరుణ్‌కుమార్, తూముల లక్ష్మణరావు, నీలాపు శ్రీనివాసరావు, పల్లా భాను తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ సాగులో రైతులకు సేవలందించాలి

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్



సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో

పాలకొండ: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్న తరుణంలో వ్యవసాయ శాఖ సిబ్బంది వారికి అండగా ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ సూచించారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయం ఆవరణలో నియోజకవర్గంలోని వ్యవసాయ శాఖ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ 14వ విడత రైతులకు సక్రమంగా అందించాలని సూచించారు. ఆగస్టు 1 నుంచి పంటల నమోదు ప్రారంభించాలని వివరించారు. రైతులకు అవసరమైన ఎరువులు అందించాలన్నారు. నారుమళ్లు వేసిన నాటి నుంచి ధాన్యం సేకరణ వరకు రైతులకు అండగా ఉండి వారి సూచనలు అందించాలని తెలిపారు. ఎరువులు, పురుగుల మందులు వేయడంలో మెలకువలను రైతులకు వివరించాలన్నారు. సమావేశంలో ఏడీ రత్నకుమారి, నాలుగు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, వీఏఏలు పాల్గొన్నారు.

పక్కాగా ఓటర్ల పరిశీలన



మాట్లాడుతున్న తహసీల్దార్ రాధాకృష్ణమూర్తి

కొమరాడ: గ్రామాల్లో బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితాలను తీసుకుని ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించాలని తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో డోర్ నంబరు ఉన్నా వాటికి డోర్ నంబరు వేసి బీఎల్‌వో యాప్‌లో ఫార్మెట్ అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు, మండల స్థాయి అధికారులు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటేందుకు సిద్ధం కావాలి

- డ్వామా పీడీ రామచంద్రరావు



విక్రంపురంలో రైతులతో మాట్లాడుతున్న పీడీ రామచంద్రరావు

కొమరాడ: జీడి మొక్కలు, మునగ, ఆయిల్ పామ్ తదితర మొక్కలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండలంలోని విక్రంపురం, కంబవలస, కుమ్మరిగుంట, గంగారేగువలస తదితర గ్రామాల్లో పొలాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో మొక్కలు పంపిణీ చేస్తామని గోతులు తవ్వి సేంద్రియ ఎరువులు వేసి అంతా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ నెలలో వేస్తే మొక్క బాగా బ్రతుకుందని చెప్పారు. మండలంలోని 182 ఎకరాలు జీడి, 30 ఎకరాలు ఆయిల్‌పామ్, 15 మంది రైతులు మునగ వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. యాయన వెంట ఏపీవో బాలకృష్ణ, క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు ఉన్నారు.

సక్రమంగా ఓటర్ల జాబితా

- సబ్ కలెక్టర్ నూరల్ కమర్



దేరువాడలో ఓటర్ల సవరణ ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

గుమ్మలక్ష్మీపురం: ఓటర్ల జాబితా పరిశీలన హేతుబద్ధంగా నిర్వహించాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. మండలంలోని వనకాబడి గ్రామ సచివాలయం పరిధిలోని దేరువాడ గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటా ఓటరు పరిశీలన ప్రక్రియను బుధవారం ఆయన తనిఖీ చేశారు. బీఎల్వోలు చేపట్టిన సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సూచనలు చేశారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను బీఎల్వోలు అత్యంత పారదర్శకంగా, జవాబుదారితనంతో నిర్వహించాలని, ఏదైనా మార్పులు, చేర్పులుంటే సంబంధిత ఫారంలో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసి అప్లోడ్ చేయాలని సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రాములమ్మ ఉన్నారు.

సచివాలయాలతో సుపరిపాలన

- పాలకొండ ఎమ్మెల్యే కళావతి



సచివాలయ భవనాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాల ద్వారా సుపరిపాలన అందుతుందని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సీతంపేట–2 గ్రామ సచివాలయ భవనాలు బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సచివాలయాలతోనే సాధ్యమన్నారు. వీటి ద్వారా ప్రజా సమస్యలు తక్షణం పరిష్కారమౌతున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థతో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయన్నారు. పథకాలు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా పరిపాలనలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యం దిశగా పయనిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, మండల పార్టీ కన్వీనర్ జి.సుమిత్రారావు, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, సర్పంచ్ ఎ.కళావతి, ఎంపీడీవో కె.సత్యం, పీఆర్ డీఈ లోకనాథం, గ్రామ కార్యదర్శి సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.